క్లుప్తంగా

రక్తదాన శిబిరం రేపు

సీతంపేట: బూర్జ మండలం పెద్దపేటలో ఈనెల 25న ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు, రెడ్‌క్రాస్ చైర్మెన్ పి.జగన్‌మోహనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు.

పకడ్బందీగా 'ప్రిజమ్ - 10'

సీతంపేట: ప్రిజమ్ – 10 కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ కె.గీతాంజలి అన్నారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయంలో వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గర్భిణీని పర్యవేక్షించడంతో పాటు రక్తహీనత నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మాతా,శిశు మరణాలు అరికట్టడానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకునేలా చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సత్యం, సీడీపీఓ రంగలక్ష్మి, వెలుగు ఏపీఎం విజయకుమారి, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన



వంగర: వృద్ధుడికి బీసీజీ టీకా వేస్తున్న సిబ్బంది

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌పై గురువారం అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, టీబీ వ్యాధిగ్రస్తులు తప్ప మిగతా వారంతా బీసీజీ టీకా వేసుకోవాలని సిబ్బంది తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జి.యోగీశ్వరి, ఎమ్ఎల్‌హెచ్‌పీ వై.దేవమణి పాల్గొన్నారు.

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం సచివాలయంలో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టి, పెద్దలకు అడల్ట్ బీసీజీ టీకాలు వేశారు. అలాగే టీబీ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యారోగ్య సిబ్బంది వివరించారు.

26న వైద్య శిబిరం

బొబ్బిలి: మండలంలోని గొంగాడవలస గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఈ నెల 26వ తేదీన వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామానికి చెందిన గొంగాడ శంకరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. శిబిరంలో 86 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు సుగర్, లిపిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షనింగ్, కిడ్నీ ఫంక్షనింగ్, థైరాయిడ్ ప్రొఫైల్, యూరిన్ ఎగ్జామినేషన్, బ్లడ్‌కౌంట్, హెచ్‌బీఏ తదితర పరీక్షలను అతి తక్కువ ధరకే నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైన వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 95503 11249ను సంప్రదించాలని కోరారు.

ఏవీపురం పాఠశాలలో ఇంటర్ తరగతులు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఎరకయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని ఏవీపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించడం జరుగుతోందని ఎంఈఓ బి.ఎరకయ్య తెలిపారు. మండలంలోని ఉనుకూరు, పోరాం, అంబాడ, వెంకటాపురం, పెద్దశిర్లాం గ్రామాలకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుతో కలిసి గురువారం వెళ్లిన ఆయన.. ఏవీపురంలో అందుబాటులోకి వచ్చిన ఇంటర్మీడియట్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేశారు. పదో తరగతి పాసైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి, ఇంటర్మీడియట్ గ్రూపులు, విద్యార్థులకు అందించే నాణ్యమైన విద్య, వసతులను వివరించారు.

కవి మూర్తికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న మూర్తి

బొబ్బిలి: విశాఖపట్నంలోని కంచరపాలెం వద్ద ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో మండలంలోని జగన్నాథపురానికి చెందిన కవి, జాతీయ తెలుగు వెలుగు సాహిత్య వేదిక అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎస్.ఎన్ మూర్తికి డాక్టరేట్ ప్రదానం చేశారు. తెలుగు సాహిత్యానికి ఆయన అందిస్తున్న సేవలకు గాను ఈ గౌరవం దక్కింది. ఈ మేరకు అయనకు ఆర్చ్ బిషప్ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు మరియకుమార్, డాక్టర్ బి.రమాదేవి తదితరులు అభినందనలు తెలిపారు.

పిల్లలూ జర జాగ్రత్త!

- సరదాగా ఈతకు వెళ్లి, ప్రమాదం బారినపడుతున్న పిల్లలు
- జాగ్రత్త వహించకపోతే ప్రమాదమని హెచ్చరిస్తున్న పెద్దలు
- ఇంటి వద్దనే స్నానం చేసుకునేలా చూడాలని సూచన



సాగునీటి కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

గరుగుబిల్లి: వేసవి సెలవుల్లో చాలామంది పిల్లలు నదులు, చెరువులు, కాలువల్లో స్నానానికి వెళ్లి, ఈత కొట్టేందుకు ఇష్టపడుతుంటారు. అయితే ఒక్కోసారి నీటిలోతు తెలియక కొంతమంది, ఈతరాక మరి కొంతమంది ప్రమాదం కొని తెచ్చుకుంటున్నారు. ఈత సరదాలో తమను తాము మర్చిపోయి మెల్ల మెల్లగా లోతైన ప్రదేశానికి వెళ్లి, మునిగిపోయి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పిల్లల కదలికలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, లేకపోతే ప్రమాదం తప్పదని పెద్దలు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకర ఆటలు ఆడకుండా, నదీతీర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలని సూచిస్తున్నారు. ఈత సరదా కోసం వెళ్లే పిల్లలు ఒంటరిగా వెళ్లకూడదని, పెద్దలను వెంట తీసుకువెళ్లాలని చెబుతున్నారు. ప్రస్తుతం ఎండలు కూడా అధికంగా ఉండడంతో వీలైనంత వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా చూడాలంటున్నారు. ఉదయం, సాయంత్రం చల్లగా ఉన్న వేళల్లో మాత్రమే వారిని ఆడుకునేందుకు ఆరుబయటకు పంపించాలంటున్నారు. ఎండల బారినపడితే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, నిమ్మరసం, గ్లూకోజ్, కొబ్బరికాయ నీరు తరచూ పిల్లలకు ఇవ్వాలని చెబుతున్నారు.

పిల్లలకు చెప్పాల్సిన జాగ్రత్తలు..

- ఎండలలో వీలైనంతవరకు తిరగకూడదు. అవసరమైతే తప్ప బయటకు పంపించొద్దు. ఎక్కువ సమయం ఇంట్లోనే విశ్రాంతి తీసుకోనివ్వండి.
- తల్లిదండ్రులు కూడా పిల్లల కోసం సమయం కేటాయించాలి. ఖాళీ సమయంలో పిల్లలతో విజ్ఞానం, వినోదానికి సంబంధించిన పుస్తకాలు చదించాలి.
- చెస్, క్యారంబోర్డు, ఫజిల్స్, పరమపదసోపానం వంటి ఆటలు ఆడేలా చూడాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు తల్లిదండ్రులకు పిల్లలు సమాచారం ఇవ్వడాన్ని అలవాటు చేయాలి.
- ఎండలలో తిరగడం ద్వారా కలిగే నష్టాలను పిల్లలకు వివరించాలి.

హద్దుమీరితే అనర్థాలే..



ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు నియోజకవర్గంలో 30 పోలీస్ యాక్ట్‌తోపాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి స్పష్టం చేశారు. మండలంలోని సిరికొండ, చిలకలవలస, గొయిదాపేట, ఆర్‌బీఆర్ పేట, కొండాపురం, అవలంగి, తదితర గ్రామాల్లో ఎస్సై ఎన్. ప్రశాంత్‌కుమార్‌తో కలిసి గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రజలంతా సమన్వయంతో వ్యవహరించాలన్నారు. అనవసర రాజకీయ చర్చలు, కవ్వింపులతో హద్దుమీరితే చర్యలు తప్పవన్నారు. ఫలితాలు వెలువడేంత వరకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామంలో సైబర్ నేరాలు, వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అవగాహన కల్పించారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఎస్ఐ ఎం.వి. రమణ ప్రస్తుత కాలంలో జరుగుతున్న చోరీలు, దోపిడీలు, సైబర్ నేరాలను వివరించి, వాటి బారినపడకుండా ఉండేందుకు అనుసరించాల్సిన విధానాలను తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అనీష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

పాలకొండ రూరల్: ఆర్‌బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎన్ని వాహని తెలిపారు. ఓని, వాటపాగు, తంపటాపల్లి సచివాలయాల పరిధిలోని సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: మండలంలోని కలువరాయి, జగన్నాథపురం, పెంట సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ డి.ఫణికిరణ్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కలువరాయి ఫీడర్ పరిధిలో విద్యుత్ స్తంభాల మార్పు, చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్కారం

వీరఘట్టం: సూర్య సిద్ధాంతం ఆధారంగా పంచాంగం రూపొందించిన శ్రీకాకుళం జిల్లా కొండవలస గ్రామానికి చెందిన పంచాంగకర్త సుబ్రహ్మణ్యశర్మను వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ ఎన్ శర్మయాజీ గురువారం ఘనంగా సన్మానించారు. వీరఘట్టాంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శర్మయాజీ మాట్లాడుతూ, సుబ్రహ్మణ్యశర్మ గొప్పతనాన్ని వివరించారు.



సుబ్రహ్మణ్యశర్మను సన్మానిస్తున్న శర్మయాజీ

విత్తనాల ఎంపిక కీలకం

గరుగుబిల్లి: పంటలదిగుబడికి విత్తనాలఎంపికే చాలా కీలకమని ఏవో ఆర్.విజయభారతి అన్నారు. ఇదే విషయమై గురువారం విలేకరులతో మాట్లాడిన ఆమె.. భూసారం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధిక దిగుబడులను ఇచ్చే పంటల కోసం విత్తనాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ప్రతీ మూడేళ్లకోసారి పొలంలో వేసే విత్తనాలను మార్చుకోవాలని, దీంతో చీడపీడలు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. పేరొందిన సంస్థల నుంచే విత్తనాలు కొనుగోలు చేసి, శుభ్రమైన, చల్లని ప్రదేశాల్లో విత్తనాలు నిల్వ ఉంచుకోవాలన్నారు. విత్తనపద్ధతి విధిగా పాటించాలన్నారు. విత్తనాలు వేసే ముందు విత్తనాల స్వచ్ఛత, నాణ్యత, మొలక శాతం తదితర అంశాలను పరీక్షించుకోవాలన్నారు.



రామభద్రపురంలో కొనుగోలుదారుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పండ్ల వ్యాపారులు



చిరువ్యాపారులకు ఎండ దెబ్బ

- వేసవిలో జనసంచారం తగ్గడంతో మందగించిన వ్యాపారం
- ఎండల వేడికి పాడవుతున్న పండ్లు, కూరగాయలు
- షెడ్లు నిర్మించి, తక్కువ అద్దెకు ఇవ్వాలని వ్యాపారుల విజ్ఞప్తి



ఎండల వేడికి పాడైపోతున్న పండ్లు

రామభద్రపురం: రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు కూడా బద్దలవుతాయంటారు పెద్దలు.. ఇది నిజమే ప్రస్తుత వేసవిలో రోళ్ల బద్దలయ్యేలా ఎండలు కాస్తున్నాయి. నిత్యం 40 నుంచి 42 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఈ ఉష్ణోగ్రతల కారణంగా ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టేందుకు జనం భయపడిపోతున్నారు. దీంతో రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమైపోతుండడంతో వ్యాపారాలు బాగా మందగించాయని వారు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రామభద్రపురం అంతర్‌రాష్ట్ర కూడలిలో పలు గ్రామాలకు చెందిన చిరువ్యాపారులు సీజనల్‌గా దొరికే రకరకాల పండ్లు, కూరగాయలు అమ్ముతుంటారు. ఇప్పుడు ఎండలకు జనసంచారం తగ్గడంతో వ్యాపారం బాగా పడిపోయిందని, అధిక ఉష్ణోగ్రతలకు పండ్లు, కూరగాయలు కూడా పాడైపోతున్నాయని దీంతో తామంతా తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ వ్యాపారం మీద ఆధారపడి బతుకుతున్న తమకు ఎండలు కష్టాలు తెచ్చిపెడుతున్నాయని వాపోతున్నారు. ఇక్కడే షెడ్లు నిర్మించి, తక్కువ అద్దెకు ఇస్తే తమ కష్టాలు తీరుతాయని అంటున్నారు.

గిరాకీ తగ్గింది..



వేసవిలో గిరాకీ తగ్గింది. ఎండల వేడికి ఎవరూ రావడం లేదు. దీంతో పండ్లు, కూరగాయల వ్యాపారం బాగా తగ్గింది. సాధారణంగా ఎండాకాలంలోనే పండ్లకు మంచి గిరాకీ ఉండాలి. కానీ అలా ఇప్పుడు లేదు. రోజుకు రూ.1000 కూడా వ్యాపారం కావడం లేదు. రోజుకు రూ.200 కూడా లాభం లేకపోతే ఎలా.. కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నాం.

–దేవతన సురేష్, కూరగాయల వ్యాపారి, రామభద్రపురం.

నష్టాల బారిన పడుతున్నాం..



నేను గత పదేళ్లుగా కూరగాయల వ్యాపారం చేస్తున్నాను. ఈ సమయంలో ఎప్పుడూ ఇంత ఎక్కువగా ఎండలు లేవు. ఎండల వేడికి కూరగాయలు, పండ్లు పాడైపోతున్నాయి. ఎండల తీవ్రత కారణంగా ఉన్న కొన్నింటిని కూడా కొనుగోలు చేసేందుకు జనాలు రావడం లేదు. దీంతో నష్టాల బారినపడుతున్నాం.

–మరడాన రామారావు, చిరువ్యాపారి, రామభద్రపురం

విజృంభిస్తున్న జ్వరాలు

- జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ఏరియా ఆస్పత్రి



ఇన్‌పేషెంట్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

సీతంపేట: అధిక ఉష్ణోగ్రతల వల్ల మన్యంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకూ జ్వరపీడితుల సంఖ్య ఎక్కువ కావడంతో ఏరియా ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. వైరల్, టైఫాయిడ్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు దోనుబాయి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో మలేరియా కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయి. ఈ ప్రాంత రోగులంతా సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు చేపట్టి వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

జియ్యమ్మవలస: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, ప్రతీ రైతు ఖరీఫ్ పనులకు ముందే నవధాన్యాలు పొలంలో వేసుకుంటే నేలకు కావాల్సిన పోషకాలు అందుతాయని ప్రకృతి వ్యవసాయం డీపీఎం పి.షణ్ముఖరాజు తెలిపారు. మండలంలోని బిత్రపాడు గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద నవధాన్యాల కిట్లు రైతులకు గురువారం పంపిణీ చేశారు. నవధాన్యాలు పొలంలో వేసి, మొక్కలైన తర్వాత వాటిని అదే పొలంలోనే కలియదున్నాలని, ఇలా చేస్తే ప్రధాన పంటకు అవసరమైన పోషకాలు పుష్కలంగా అంది, మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, వీఏఏ శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం డీపీఎం షణ్ముఖరాజు

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం


గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ సహకారంతో అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హోమం, పూజలు చేపట్టారు. ఈ హోమం చేయడం ద్వారా అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు.



ఆలయ ప్రాంగణంలో హోమం చేస్తున్న భక్తులు

ముగిసిన కల్యాణ మహోత్సవాలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వార్షిక కల్యాణ మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. వైశాఖ శుద్ధ ఏకాదశి నుంచి వైశాఖ శుద్ధ పౌర్ణమి వరకు పాంచాణిక దీక్షతో ఆలయ అర్చకులు వి.వి.అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం, తదితర పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన చాలా మంది భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.



పూజలందుకున్న ఉత్సవమూర్తులు

ఎమ్మెల్యే పరామర్శ

జియ్యమ్మవలస: మండలంలోని బీజేపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆ గ్రామానికి గురువారం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే రాజు లేకపోవడం చాలా దురదృష్టకరమని, బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ఆలోచనలకు పదును పెట్టాలి



పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థులు ఖాళీ సమయాల్లో తమ ఆలోచనలకు పదునుపెట్టాలని తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ జి.మురళి అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వ్యర్థాలతో బొమ్మలు, కళాకృతులు తయారు చేయు విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి,విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బబ్బూరి గణేష్‌బాబు, ఉపాధ్యాయుడు జామి రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలు మంజూరు చేయాలి

కురుపాం:

గిరిజన విద్యార్థుల ఇంటర్మీడియట్ చదువు కోసం అదనంగా కళాశాలలు మంజూరు చేయాలని, అలాగే పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతీ గిరిజన విద్యార్థికి కళాశాలలో సీటు కేటాయించాలని ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రొబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇదే విషయమై గురువారం విలేకరులతో మాట్లాడిన వారు.. గతంలో జనాభా ప్రాతిపదికన గిరిజన విద్యార్థుల చదువును ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా కొన్ని కళాశాలలు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం పెరిగిన జనాభాకు అనుగుణంగా సీట్లు ఉండడం లేదని, దీంతో ఎంతోమంది గిరిజన విద్యార్థులు చదువుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యా విభాగం అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు.



ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు లోవరాజు, రామకృష్ణ

ముమ్మరంగా వాహన తనిఖీలు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా పలు కూడళ్లలో ఎస్సై షేక్ ఫకృద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని వారి నుంచి అపరాధరుసుం వసూలు చేశారు.